# పగటి వేషగాళ్ల మాటలు నమ్మొద్దు

- అభివృద్ధిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ అడ్డదారులు
- తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో గుబులు
- కట్టంగూర్ ఎన్నికల ప్రచారంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ , ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- భారీ ర్యాలీతో గులాబీమయమైన పట్టణం


నార్కట్‌పల్లి : బీఆర్‌ఎస్‌లో చేరినవారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, అక్టోబర్ 19 : నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపించానని మరో సారి ఆశీర్వదించి గెలిపించాలని బడుగుల లింగయ్య యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ సర్కిల్ నుంచి అండర్ పాసింగ్ వరకు గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ మాయమాటలు చెప్పే కాంగ్రెస్ నాయకులను ఊర్లకు రాకుండా తరిమి వేయాలన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పగటి కలలు కంటున్నారన్నారు. అమలుకాని హామీలతో ఓట్ల కోసం వస్తున్న పగటి వేషగాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్‌లో టికెట్ల కొట్లాటలు, గ్రూపు తగదాలు తప్ప మరేం లేదన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల గుండెల్లో రైలు పరుగెడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చే మూడు గంటల కరెంట్ కావాలా.. సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరంట్ కావాలో మనందరం తేల్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పాలనకు సంపూర్ణ మద్దతు తెలిపి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.. నకిరేకల్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల కోసం రాత్రి, పగలనక కష్టపడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మరోసారి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో ప్రకటించిన హామీలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇచ్చినే ఒక్క హామీని నెరవెర్చే పరిస్థితిలో లేదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, జడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గుర్రం సైదులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులుడు పాలడుగు హరికృష్ణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వడ్డె సైద్దిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుందారపు వెంకట్‌రెడ్డి, బీరెల్లి ప్రసాద్, చౌగోని జనార్దన్, మేకల రమేశ్, అంతటి శ్రీను, తండు పద్మ, గాజుల బుచ్చమ్మ, మునుగోటి ఉత్తరయ్య, రెడ్డిపల్లి మనోహర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

బీ ఫామ్ అందుకున్న అనంతరం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కట్టంగూర్ మండల కేంద్రంలోని శ్రీసాయి మణికంఠ ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ రోడ్ షోకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రోడ్ షో సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది.

## ప్రశాంత పాలన కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- 50 వడ్డెర కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక

నకిరేకల్: నియోజకవర్గంలో ప్రశాంత పాలన కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. గురువారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో వడ్డెర కుటుంబానికి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో కుంచం వెంకన్న, సంపంగి సురేశ్, రూపని రాంబాబు, వరికుప్పల వెంకన్న, కొడిదల శివశంకర్, గోగుల వీరస్వామి, కొడిదల బుచ్చయ్య, కొర్రల వీరబాబు, వరికుప్పల ఇద్దయ్య, ఆలకుంట్ల రమేశ్, గోసుపెద్ద నర్సింహ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్లు పల్లె విజయ్, గర్ష కోటి సైదులు, చౌగోని సైదులు, నాయకులు పరమేశం, వెంకన్న పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ 19వ వార్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గదేవి విగ్రహం వద్ద రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం పూజలు నిర్వహించారు. అంతకుముందు వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 మంది ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ప్రజ్ఞాపురం శ్రీనివాస్, రాము, శివకుమార్, సైదులు, అంశాల భాస్కర్, మేడిపల్లి సైదులు, వెంకన్న, భిక్షం, గడ్డం సత్తయ్య, శివరాం, చెన్నారపు ప్రసాద్, మేడిపల్లి శ్రీను ఉన్నారు.

చిట్యాల : మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన ఉయ్యాల ప్రశాంత్‌గౌడ్ గతంలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశాడు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశాంత్ ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించగా వెంటనే ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎలికట్టె సర్పంచ్ ఉయ్యాల సత్తయ్య, ఎంపీటీసీ గొలనుకొండ దశరథ, ఉయ్యాల కృష్ణయ్య, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

## 22 నుంచి ముహూర్తాలు

- వాట్సాప్, ఈ- మెయిల్‌తో ఆహ్వానం

రామగిరి, అక్టోబర్ 19: గత రెండు మాసాలుగా శుభ ముహూర్తాలు లేక వివాహ ప్రక్రియను ప్రజలు నిర్వహించ లేదు. అయితే ఈనెల 22 నుంచి డిసెంబర్ చివరి వరకు పుష్కలంగా ముహూర్తాలు ఉండడంతో ఇక పెండ్లి హడావుడి ప్రారంభమైంది. అయితే ఆధునిక కాలంలో ట్రెండ్ పూర్తిగా మారింది. పూర్వ కాలం నాటి పెండ్లి పత్రికల స్థానంలో ప్రస్తుతం ఆహ్వానాలను ఈ-మెయిల్, వాట్సాప్‌లలో వస్తున్నాయి. ఈనెల 22 నుంచి మళ్లీ ప్రారంభమవుతుండటంతో ఇక డిసెంబర్ చివరివరకు పుష్కలంగా ముహూర్తాలు ఉన్నాయి.

- అక్టోబర్ : 22, 24, 25, 26, 27లో
- నవంబర్ : 4, 16, 18, 19, 22, 23, 24, 25, 29 లో
- డిసెంబర్ : 2, 3, 6, 7, 8, 14, 15,19, 20, 21, 22, 24లో ముహూర్తాలున్నాయి.

### డిసెంబర్ వరకు ముహూర్తాలు అధికమే



ఆషాఢం, అధిక శ్రావణ మాసంతో రెండు మాసాలుగా ఎలాంటి ముహూర్తాలు జరగలేదు. అయితే భాద్రపద మాసం ప్రారంభమవుతుండడంతో ఈనెలలో 22 నుంచి డిసెంబర్ వరకు ముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. ఇప్పటికే పెండ్లిలు చేయాలనుకునే వారు ముహూర్తాలు నిర్ణయం చేసుకుని బ్రాహ్మణులను బుకింగ్ చేసుకున్నారు.

–దౌలాతాబాద్ వాసుదేవశర్మ,
ప్రముఖ పురోహితులు, చిట్యాల

## ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి : తాసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ స్వప్న

కట్టంగూర్, అక్టోబర్ 19 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఎల్‌ఓలు విధులు బాధ్యతగా నిర్వహించాలని తాసీల్దార్ డి. స్వప్న అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన బూత్‌లెవల్ అధికారుల అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాదారు. నిష్పక్షపాతంగా పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, డీటీ సుకన్య, ఏపీఓ కడెం రాంమోహన్, ఎపీఎం చౌగోని వినోద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్

రామగిరి, అక్టోబర్ 19: ఈనెల 18, 19న శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం జరిగిన కాన్ఫరెన్స్‌లో ఆయన ' కంపెర్షన్ ఆఫ్ అప్పర్ బాడీ మజిల్ స్టెగెత్ అమాంగ్ వాలీబాల్ ప్లేయర్స్ అండ్ హాకీ ప్లేయర్స్ ఆఫ్ నల్లగొండ డిస్ట్రిక్ట్ అనే అంశంపై ప్రసంగించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో నిర్వహించారు. తాను అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు సహకరించిన ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.


శ్రీలంకలోని అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి

## 23న దసరా నిర్వహించు కోవాలి

- తెలంగాణ విద్వత్సభ నల్లగొండ జిల్లా కన్వీనర్ పెన్నా మోహనశర్మ

రామగిరి, అక్టోబర్ 19: విజయదశమి(దసరా) పండుగను ఈ పర్యాయం ఈనెల 23న జరుపుకోవాలని తెలంగాణ విద్వత్సభ నిర్ణయం చేసిందని ఆ సభ కన్వీనర్ పెన్నా మోహనశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పీఠాదీశులు, తెలంగాణ విద్వత్సభ అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, కార్యదర్శి గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతితోపాటు అందరు ఆమోదం చేశారని గుర్తుచేశారు. ఈనెల 24న మంగళవారం రోజున రాజ్ఞాం పట్టాభిషేకాన్ని ఆచరించాలని కోరారు.

## పాము కాటుతో మహిళ మృతి

నల్లగొండ సిటీ, అక్టోబర్ 19 : కనగల్ మండలం దర్వేశిపురంలోపాము కాటుతో మహిళ మృతి చెందింది. కనగల్ ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోలి లక్ష్మీశ్వేత (26)ఈనెల 17న మంచి నీళ్లబావి గ్రామానికి చెందిన మద్దిరాల జగాల్‌రెడ్డికి చెందిన నిమ్మ తోటలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.మృతురాలి అక్క మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు షురూ

శాలిగౌరారం, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని శాలిగౌరారం సీతారామచంద్రస్వామి ఆలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ ప్రారంభోత్సవాలు గురువారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, రక్షా బంధన, అగ్ని ప్రతిష్ఠ వాస్తు పూజ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు నిర్వహి ంచారు. కార్యక్రమాల్లో ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ దాత చాడ కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. నేడు విగ్రహ ప్రతిష్ఠించనున్నారు.


వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన మహిళలు

## వృత్తి నైపుణ్యంతోనే ఉపాధి

వలిగొండ, అక్టోబర్ 19 : వృత్తి నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు దొరుకుతాయని సర్పంచ్ పసల అన్నామేరి శౌరి అన్నారు. గురువారం మండలంలోని వెల్వర్తి గ్రామంలో వృత్తి నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వివిధ వృత్తుల్లో శిక్షణ పొందిన వారు ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హరికృష్ణ, మధు, కృష్ణ, స్వామి, లక్ష్మి, దేవేంద్ర, కృష్ణలీల, పద్మ పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలు

మోత్కూరు, అక్టోబర్ 19 : మోత్కూరు మండలకేంద్రంలో గురువారం గ్యాస్ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంగడి బజార్‌కు చెందిన ఎండీ ఖలీమొద్దీన్ పాత ఇనుప దుకాణంలో ఆకస్మాత్తుగా సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఖలీమొద్దిన్‌తో పాటు వర్కర్‌కి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక దవఖానకు తరలించారు. స్థానిక ప్రజాప్రనిధులు, అధికారులు పరిశీలించారు.